క్లుప్తంగా

గుండ్రేవుల ప్రాజెక్ట్‌ను నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రసూల్

సి.బెళగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మించేందుకు కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్ కోరారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో ఆదివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ అధ్యక్షతన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీలకు అతీతంగా సమష్టిగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

నివాళి



పెద్దమారెప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవులకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్దమారెప్ప శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, స్థానిక నాయకులు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జగనన్న కాలనీలో ముమ్మరంగా అభివృద్ధి పనులు



గడివేముల జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీన లేఅవుట్ వద్ద 265 మందికి ఇంటి పట్టాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసిన విషయం తెలిసిందే. కాలనీలో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు పనులు చేపట్టారు. వారంలో రోజుల్లో పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. దీంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే జగనన్న లే అవుట్‌లో దాదాపు 50 మంది లబ్ధిదారులు బేస్‌మటం వేశారు.

సీపీఎం ఉద్యమ శ్రేయోభిలాషి వెంకట్రామిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఉద్యమ శ్రేయోభిలాషి కె.వెంకట్రామిరెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం వెంకట్రామిరెడ్డి మరణ వార్తను తెలియగానే ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేవనకొండ మండలం తెర్నేకల్‌లో జన్మించిన వెంకట్రామిరెడ్డి విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారన్నారు.

అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో జయించాలి

కర్నూలు(హాస్పిటల్): అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో జయించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకర శర్మ చెప్పారు. నగర సమీపంలోని పసుపుల రోడ్డులో ఉన్న అక్షిత అంధుల పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఆయన తన వంతుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి పంచేంద్రియాల్లో అంధత్వమున్న వారు బాధపడాల్సిన అవసరం లేదని, ఆత్మవిశ్వాసంతో దానిని జయించి అందరికీ ఆదర్శంగా నిలిచిన వారు ఎంతో మంది ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుధాకర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లారీలు పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : అనుమతులు లేకుండా పత్తికొండ వద్ద మూడు లారీల్లో నాపరాయి, ప్యాపిలి దగ్గర ఓ లారీలో డోలమైట్ చిప్స్ తరలిస్తుండగా శనివారం అర్ధరాత్రి తనిఖీ చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమార్కులు నాపరాయి, డోలమైట్ చిప్స్‌ను రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని చెప్పారు. పత్తికొండలో పట్టుకున్న మూడు లారీలను బస్టాండ్‌లో, ప్యాపిలిలో స్వాధీనం చేసుకున్న లారీని పోలీసుస్టేషన్‌లో ఉంచినట్లు వెల్లడించారు. వాహన యజమానులపై కేసు నమోదు చేసి రూ.1.66 లక్షలు జరిమానా విధించామని చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

ఎల్లార్తి ఉరుసుకు చురుగ్గా ఏర్పాట్లు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామ సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గన్న, ఎస్కే గిరి ఆదివారం దర్గా రోడ్డును బాగు చేయించారు. పొక్లెయినర్, ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్‌తో గుంతలను పూడ్చి చదును చేయించారు.



శరవేగంగా నిర్మాణమవుతున్న వేంకటేశ్వరస్వామి దేవాలయం



ఆలయం చుట్టు అద్భుతమైన సుందరంగా చెక్కి శిల్పాలు, కట్టడాలు



అపురూపం.. ఆలయ నిర్మాణం!

చారిత్రాత్మకంగా కోడుమూరు శ్రీలక్ష్మి వేంకటేశ్వర దేవాలయ పునర్నిర్మాణం

- రూ.10 కోట్లతో పురాతన ఆలయంలా రూపకల్పన
- అంతా రాతికట్టడమే... పైకప్పు సైతం రాతిదూలాలతో ఏర్పాటు
- ఏడు ఉచిత కల్యాణ మండపాలు, అరవై వసతి గదులు
- నిత్య రథోత్సవం..నిత్యన్నదానం అమలుకూ ప్రణాళికలు



శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం వ్యూ

కోడుమూరు : మండల కేంద్రం కోడుమూరు పట్టణంలో ఎంతో చారిత్రాత్మకంగా శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం పున:నిర్మాణం జరుగుతోంది. నలభై ఏళ్ల క్రితం లక్ష్మీనగర్‌లో ఏర్పాటైన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం శిథిలమవ్వడంతో పున:నిర్మాణానికి కమిటీ సభ్యులు ఎద్దుల మహేశ్వరరెడ్డి శ్రీకారం చుట్టారు. ఎకరా స్థలంలో దాతల సహాయ సహకారాలతో రూ.10 కోట్లతో చేపట్టిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర దేవాలయం పున:నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. పురాతన దేవాలయాల తరహాలోనే ఈ దేవాలయాన్ని పూర్తిగా రాతిదూలాలు, రాతి స్తంభాలు, శిల్పాలతో స్థిరస్థాయిగా ఉండే విధంగా నిర్మిస్తున్నారు. దేవాలయ నిర్మాణంలో శాస్త్రీయ, సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ సిమెంట్, సున్నం, వాడకుండా పూర్తిగా రాతిదూలాలతోనే దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయంలో పంచభూతాలకు అధిపతులైన వినాయకుడు, సూర్యభగవానుడు, వేంకటేశ్వర స్వామి, మహలక్ష్మీదేవి, ఈశ్వరుడు, పార్వతీ దేవి, దేవతమూర్తులు కొలువుదీరనున్నారు. ఆళ్లగడ్డకు చెందిన 20 మంది శిల్పులు నాలుగేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. రాతిదూలాలపై సుందరంగా శిల్పాలను చెక్కి దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. దేవాలయ పైకప్పు సైతం రాతిదూలాలతోనే నిర్మించడం విశేషం. తమిళనాడులోని కంచి నుంచి రాయిని తెప్పించడంతో పాటు, మహబలిపురంలో కళాకారుల చేత దేవతామూర్తుల విగ్రహలను తయారు చేయించి ఆలయం చుట్టూ ఏర్పాటు చేశారు. ఆలయం బయట భాగం చుట్టూ శ్రీమహావిష్ణు దశవతార దేవతమూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయించారు. ఆలయ నిర్మాణం పూర్తయితే జిల్లాలో కోడుమూరు మరో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందే అవకాశం ఉంది. దేవాలయ పున:నిర్మాణానికి ఇప్పటికే రూ.8 కోట్లు ఖర్చయినట్లు సభ్యులు తెలిపారు. ఇంకా రూ.3 కోట్లతో ఆలయానికి నాలుగు ముఖ ద్వారాలను నిర్మిస్తున్నారు. గర్భగుడిలో విద్యుద్దీపాలేకుండా అఖండ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. గర్భగుడిలోకి సంవత్సరంలో మూడు నెలలపాటు శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహంపై సూర్యకిరణాలు పడే విధంగా దేవాలయాన్ని రూపొందించడం విశేషం.

నిత్యాన్నదానం :

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తయిన వెంటనే నిత్యన్నదానం ఏర్పాటు చేసే విధంగా కమిటీ సభ్యులు విరాళాలను సేకరిస్తున్నారు. శాశ్వత అన్నదానం కోసం మూడు సంవత్సరాల వ్యవధిలో 730మంది భక్తుల నుంచి రూ.2.16 లక్షల చొప్పున వాయిదాల పద్ధతిలో విరాళాలను సేకరిస్తున్నారు. 730మంది నుంచి వసూలైన దాదాపు రూ.15 కోట్లను బ్యాంకులో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీ ద్వారా భక్తులకు నిత్యన్నదానం జరిపించాలన్నదే కమిటీ సభ్యుల లక్ష్యం. ఇప్పటికే దాదాపు 325 మంది నుంచి విరాళాలను సేకరించారు.

ఏడు కల్యాణ మండపాల నిర్మాణం

శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆధ్వర్యంలో ప్రజలు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఒక్కొక్కటి రూ.కోటివ్యయంతో ఏడు కల్యాణ మండపాలు, 60వసతి గదులను నిర్మించనున్నారు. వీటిల్లో అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు శుభకార్యాలను ఉచితంగా నిర్వహించుకుందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిత్య రథోత్సవం

భారతదేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ రథోత్సవం చేపట్టేలా ఆలయ ప్రాంగణంలో మాఢ వీధులను ఏర్పాటు చేస్తున్నారు. పంచభూతాలకు అధిపతులైన వినాయకుడు, సూర్యభగవానుడు, వేంకటేశ్వరస్వామి, మహలక్ష్మీదేవి, ఈశ్వరుడు, పార్వతీ దేవి, దేవతమూర్తులను మాఢ వీధులలో ప్రతిరోజూ సాయంత్రం 7గంటల సమయంలో రథోత్సవం జరిగేలా ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయ కమిటీ సభ్యులు వీరే

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలను సేకరించేందుకు 12 మంది కమిటీ సభ్యులు ఏర్పాటయ్యారు. ఎద్దుల మహేశ్వరరెడ్డి, సూర్యరెడ్డి, వేణుగోపాల్, రాజశేఖర్, విజయ్‌సారథి, తిమ్మారెడ్డి, రామకృష్ణ, గంగాధర్, మధుసూదన్, వెంకటస్వామి, వెంకటేష్‌రెడ్డి, రాంప్రసాద్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. రూ.10 నుంచి రూ.కోటి రూపాయల వరకు భక్తుల నుంచి విరాళాలను సేకరించారు. రోడ్డుపై పాలు, పెరుగు అమ్ముకునే గిడ్డమ్మ అనే భక్తురాలు సైతం తనవంతుగా నిత్యానదానానికి రూ.2.16 లక్షలు అందజేయడం విశేషం. ఇలా ఎంతోమంది ఉదారంగా విరాళాలు ఇవ్వడంతో పున:నిర్మాణమవుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాదాపుగా రూ.30 కోట్ల ఆస్తులు చేకూరనున్నాయి.

ఆలయాలు ధర్మ నిలయాలు



ఆలయాలు ధర్మ నిలయాలు... వ్యాపార సముదాయాలు కాదు అని చాటి చెబుతూ విరాళాలు సేకరిస్తున్నాం. కల్యాణ మండపాలు, వసతి గృహాలు నిర్మించి పేదల వివాహాలకు ఉచితంగా వసతి కల్పిస్తున్న మొట్టమొదటి దేవస్థానంగా చిరస్థాయిగా నిలిచిపోతుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా నిత్య రథోత్సవం, అన్నదానం కొనసాగించేలా నిర్ణయం తీసేసుకున్నాం. ఒకే వేదికపైన ఏకకాలంలో శివపార్వతులకు, శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వాములకు కల్యాణం చేయనున్నాం. దైవాజ్ఞతో చేపట్టిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం పున:నిర్మాణానికి దాతల సహకారం సంపూర్ణంగా ఉంది.

– ఎద్దుల మహేశ్వరరెడ్డి, శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్

నేడు గొల్లలదొడ్డిలో హెల్త్ క్యాంప్

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ప్రటనలో పేర్కొన్నారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఒండుట్లలో...

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్లలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. వైద్య నిపుణులు వివిధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముదుమలగుర్తిలో...

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ముదుమలగుర్తిలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు కందికయపల్లెలో...

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మద్దూర్ పీహెచ్‌సీ డాక్టర్ సునీతా తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 8.30గంటలకు హెల్త్ క్యాంప్ ప్రారంభవుతుందని, ఉచితంగా అన్నిరకాల వైద్య పరీక్షలతోపాటు మందులు అందజేస్తామన్నారు. హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు.

స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. స్పందనకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి



వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న సుభాష్, తదితరులు

కర్నూలు(అర్బన్): స్వాతంత్ర్య ఉద్యమంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడిగా వడ్డె ఓబన్న చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు అడుగులు వేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బత్తుల లక్ష్మీకాంతయ్య ఆధ్వర్యంలో స్థానిక బీసీ భవన్‌లోని ఓబన్న విగ్రహానికి బీసీ, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న చూపించిన తెగువ, పోరాటాలను నేటి తరానికి తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, నాయకులు అయ్యన్నయాదవ్, చంద్రికమ్మ, వెంకట్రాముడు, బ్రహ్మయ్య ఆచారి, వడ్డెర సర్వేష్‌బాబు, శ్రీరాములు యాదవ్, కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రామాంజనేయులు

కర్నూలు (టౌన్): జుడో తరహాలో జీ-జుతుస్ నూతన క్రీడ కరాటేలో క్రీడాకారులు రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని యూకాన్ ప్లాజా ప్రాంగణంలో జీ-జుతుస్ జిల్లా కరాటే సంఘం ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులు, పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జీ-జుతుస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాసిన్ షరీఫ్, జిల్లా సంఘం అధ్యక్షుడు షకీల్, కార్యదర్శి ఖాదర్ బాషా, ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

అత్యుత్తమ క్రీడల్లో విలువిద్య ఒకటి



ప్రతిభ చాటిన క్రీడాకారిణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పారిశ్రామికవేత్త రుషికుమార్

కర్నూలు (టౌన్) : దేశంలోనే అత్యుత్తమ క్రీడల్లో విలువిద్య ఒకటి అని పారిశ్రామిక వేత్త రుషి కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్, జూనియర్ ఆర్చరీ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూవిలువిద్య క్రీడకు కర్నూలులో మంచి ఆదరణ ఉందన్నారు. సబ్ జూనియర్ స్థాయిల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఏకాగ్రతను పెంచే ఇటువంటి క్రీడల వైపు తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం పోటీ ల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బాపూజీ, విలువిద్య సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యచంద్ర, నాగరత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

దంతాలను పటిష్టంగా ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): దంత వైద్యపరీక్షలు తరచూ చేయించుకుంటూ వాటిని పటిష్ఠంగా ఉంచుకోవాలని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సారా డెంటల్ క్లినిక్, సీఆర్ఆర్ ఎంఎం మున్సిపల్ పాఠశాల స్కూల్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏపీఎస్‌పీ క్యాంపు ఆవరణలోని కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన చిన్నారులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి పేస్టులు, బ్రష్‌లు, మౌత్‌వాష్‌లు, మందులు పంపిణీ చేశారు. అనంతరం రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల దంత సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదేనని చెప్పారు. దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. దంత సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దంత వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నోటి క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సాబీరహ్మద్, డెంటల్ సర్జన్ డాక్టర్ బి. సాయిశృతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. వెంకటరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్.మాబాషా, సభ్యులు ఎస్. కరీముల్లా, ఎన్.వేణు, డి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పురావస్తు కట్టడాలను కాపాడాలి

కర్నూలు కల్చరల్: పురావస్తు శాఖ కట్టడాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ వినతి పత్రం అందజేశారు. విజయవాడలో జరిగిన బీజేపీ సోషల్ మీడియా వలంటీర్స్ సమావేశానికి హాజరైన ఆమెకు జిల్లాలోని పురవాస్తు కట్టడాలు, ఆక్రమణల గురించి వినతి పత్రం అందజేశారు.

హరినామ సంకీర్తనతో ప్రశాంతత

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నిత్యం భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ జీవిత గమనానికి మార్గదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి

కర్నూలు(సెంట్రల్): కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితమై పోరాటాలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా వి.గిరి కుమార్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి అల్లం సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ వేతనంతో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. అల్లం సురేష్‌బాబు మాట్లాడుతూ..అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలన్నారు. అనంతరం నూతనంగా రెండు జిల్లాలకు రెండు కమిటీలను ప్రకటించారు.

మునిసిపల్ కమిషనర్ తీరు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలంటే కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ విధించిన నిబంధనలు బాధాకరం కలిగిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల అన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో క్లాప్ ఆటో డ్రైవర్లకు కమిషనర్ ఇచ్చిన నిబంధనల చార్టుపై కార్మిక సంఘ నాయకులు చర్చించారు. జీతం ఇచ్చినప్పుడు తీసుకోవాలని, అంతవరకు అడగకూడదని చెప్పడం అన్యాయమన్నారు. నెలకు జీతం రాకపోతే వారి కుటుంబం ఏ విధంగా ఇబ్బంది పడుతుందన్న ఆలోచన లేకుండా కమిషనర్ వెట్టిచాకిరి చేయించుకునేలా నిబంధనలు రూపొందించి కార్మికులతో సంతకాలు తీసుకొని పని చేయించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు ఇప్పించి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, నాయకులు విజయ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయం



ముచ్చుకోట వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూసిటీ) : గ్రంథాలయ ఉద్యమంలో ముచ్చుకోట వెంకటరమణయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జేఎస్ఆర్‌కే శర్మ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పింగళి సూరన్న తెలుగు తోటలో గ్రంథాలయ తాతయ్య వెంకటరమణయ్య జయంతి ఉత్సవ సభ జరిగింది. కావెం సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ వెంకటరమణయ్య తెలుగు, సంస్కృతం భాషల్లో పండితులని కోనియాడారు. శతవధాని డాక్టర్ ఆముదాల మురళి మహాభారతం సభాపర్వం గురించి ప్రసంగించారు. అంతకుముందు ముచ్చుకోట వెంకటరమణయ్య, మేడూరు దీక్షితులు వెంకటసుబ్బయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకట చంద్రశేఖర్ భార్య విజయకుమారి, డాక్టర్ పార్వతి, లక్ష్మయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ వి.పోతన్న, ఎలమర్తి రమణయ్య, సూర్యశ్రీ చంద్రమౌళి, సవ్వప్ప, ఈరన్న, ఓర్వకల్లు సంజీవరెడ్డి, డాక్టర్ రమణయ్య, సయ్యద్ జహీర్, మల్లు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిపై దాడి పిరికిపంద చర్య

కర్నూలు(అర్బన్): మాజీ మంత్రి, పెనుగొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ కాన్వాయ్‌పై బాంబు దాడి పిరికిపంద చర్య అని జిల్లా కురువ సంఘం నేతలు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ అనంతపురం జిల్లా గోరంట్ల మండలంలో పర్యటిస్తున్న శంకర్‌నారాయణ కాన్వాయ్‌పై బాంబు వేశారని, అయితే అదృష్టవశాత్తు పేలకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందన్నారు. ఉన్నత భావాలు, మంచి వ్యక్తిత్వం ఉన్న శంకర్‌నారాయణను రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు పిరికిపందలు బాంబు దాడులు చేయించారని విమర్శించారు.

రైతన్నకు సాగు పరీక్ష!

- కరుణించని వరుణుడు... ప్రశ్నార్థకంగా రబీ సాగు
- దేవుడిపై భారం ఉంచి శనగ విత్తుతున్న రైతులు



కోడుమూరులో ట్రాక్టర్‌తో శనగ విత్తనం సాగు చేస్తున్న రైతులు

కోడుమూరు రూరల్ : వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునేంత వరకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నా వరుణుడు మాత్రం పరీక్ష పెడుతూనే ఉన్నాడు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల మూలగంగా ఖరీఫ్ సీజన్‌లో చాలామంది రైతులు పంటలను సాగు చేయలేక పోయారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ కింద దాదాపు 13వేల హెక్టార్లకు పైనే రైతులు పంటలు సాగు చేయాల్సివుండగా, కేవలం 9వేల హెక్టార్లలోపే పత్తి, ఉల్లి, కంది, సజ్జ, మిరప, కొర్ర వంటి పంటలు సాగు అయ్యాయి. అయితే వరుణదేవుడు కరుణించకపోవడంతో నిరాశే మిగిలింది. ఎదుగు బొదుగులేని పత్తి ఇతర పంటలను తొలగించిన రైతులు రబీ సాగుకు సిద్ధమయ్యారు. కనీసం రబీలోనైనా సమృద్ధిగా వర్షాలు కురిస్తే పంటలు సాగు చేయాలనుకుంటున్న రైతులు సందిగ్ధంలో పడ్డారు. రబీ సీజన్‌లోనూ ఆశించిన వర్షం కురువకపోవడంతో రైతన్న ఆందోళన చెందుతున్నారు.

అరకొర వానలకే శనగ సాగు...

ఖరీఫ్‌లో పంటలు సాగు చేయలేకపోయిన రైతులంతా రబీలో పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. రబీ కింద మండలంలో 9వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయాల్సి ఉంది. ఈ ఏడాది 12 నుంచి 13వేల ఎకరాల్లో పంటలు సాగు అతుతాదని అధికారుల అంచనా. అయితే ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవకపోవడంతో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారింది. అయితే అన్నదాత వరుణదేవుడిపై భారం వేసి ఆశల సాగుకు సిద్ధం అవుతున్నారు. వారం కిందట కురిసిన అరకొర వర్షాలకే శనగ సాగు చేపట్టారు.

రబీ పంటల సాగుకు ఇంకా సమయం ఉంది



రబీ సీజన్ కింద పంటలు సాగు చేసేందుకు ఈనెల 20వతేదీ వరకు సమయం ఉంది. అరకొర పడిన వానకు పంటలు సాగు చేయకపోవడమే మంచింది. కొందరు శనగ విత్తన సాగు చేపట్టారు. వర్షం పడకపోతే మొలకెత్తిన విత్తనాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. వర్షాలు పడి భూములు పదునెక్కిన తర్వాతే పంటలు సాగు చేయాలి. వర్షం రాకకోసం ఎదురు చూడడమే మంచిది. – రవిప్రకాష్ గౌడ్, ఏఓ, కోడుమూరు

14 ఎకరాల్లో విత్తన వేశా



ఖరీఫ్‌లో వానలు సరిగా కురవకపోవడంతో సాగు చేయలేదు. రబీ కింద శనగ పంట సాగు చేద్దామని ఎదురు చూస్తుంటే ఇప్పటి వరకు భారీ వర్షం పడలేదు. అయోమయంగా ఉంది. వరణుడిపై భారం వేసి గత వారం కిందట కురిసిన చిన్నపాటి వర్షానికే 14ఎకరాల్లో శనగ సాగు చేశా. దేవుడిపై భారంవేసి రెండు రోజుల్లో మరో నాలుగు ఎకరాల్లో కూడా శనగ సాగుకు సిద్ధం అవుతున్నా.

– తేనేశ్వరరెడ్డి, కోడుమూరు